# స్నేహవాది


- లక్ష్మీహరిబండి



మాలతి, శేఖర్‌లు విశాఖపట్టణం నుండి వెంకటేశ్వరస్వామి కల్యాణం చేయించటానికి తిరుపతికి వచ్చారు. రైల్వే స్టేషన్ నుండి సరాసరి తిరుమలకు టాక్సీ తీసుకుని వెళ్ళారు. శేఖరు స్నేహితుడు వీరి కోసం కొండమీద అన్ని ఏర్పాట్లు చేశాడు. తెల్లవారి ప్రొద్దున పది గంటల కల్లా స్వామి వారి ఆలయానికి వచ్చి కల్యాణం టిక్కెట్టు చూపించి లోపల వచ్చి కూర్చున్నారు. అక్కడ వరుసగా ఉన్న షెడ్‌లలో జనం మెల్లిమెల్లిగా వచ్చి చేరుతున్నారు. ఖాళీ బెంచీలన్నీ జనంతో నిండిపోతున్నాయి.

శేఖర్ కూర్చోగానే చేతిలో ఉన్న వార్తాపత్రిక లోపలి షీటు తీసి మాలతికిచ్చి తాను ఇక అందులో పూర్తిగా నిమగ్నమై పొయ్యాడు. మాలతికెందుకో ఆ క్షణంలో పేపరు చదవాలనిపించలేదు. మాలతికి ఎంతో ఇష్టమైన హాబీ కొత్త ప్రదేశానికి వెళ్ళినప్పుడు తన చుట్టూ ఉన్న కొత్త మనుషులని చదవటం. వారి బాహ్యరూపాన్ని బట్టి, వేష భాషలను బట్టి, ముఖ కవళికలను బట్టి వారి మనస్తత్వాన్ని అంచనా వేయటం మాలతికి ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంటుంది. ఇప్పుడూ అదే పనిలో నిమగ్నమైంది. రకరకాల జంటలు, రకరకాల కాంబినేషన్స్ - లావుగా ఉన్న భర్త, సన్నగా, నాజూగ్గా ఉన్న భార్య, లావుగా పాత్రంలా ఉన్న భార్య, యువకుడిలా చక్కగా ఉన్న భర్త, నల్లగా, బొగ్గులా ఉన్న భర్త, పసిమి ఛాయతో అందంగా కుందనపు బొమ్మలా ఉన్న భార్య, ఇద్దరూ మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లాగా పోటీగా ఉన్న జంటలు, ఇక పోతే కొత్త జంటలు, వారి సిగ్గు దొంతరలు, ముసిముసి నవ్వులు, దొంగ చూపులు. ఇంతలో ఒక జంట మూడేళ్ళ కుర్రాడ్ని ఎత్తుకుని వచ్చి అవతల వరుసలో రెండో బల్లమీద కూర్చున్నారు. ఆ కుర్రాడి చేతిలో ఐస్‌క్రీం కారిపోతూ ఉంది. మాలతి అందరినీ చూస్తున్నట్టుగానే వాళ్ళనూ చూసింది. ఏదో అనుమానం వచ్చి మళ్ళీ పరీక్షగా వాళ్ళ వైపు చూసింది. అవును, అనుమానం లేదు. అది రాణియే. ఇంతకు ముందుకంటే కొంచెం లావైంది, పట్టుచీరలో నిండుగా కనిపిస్తోంది. పక్కనున్నది మరెవరో కాదు సుధీరే. ఆ కుర్రాడు వాళ్ళ కొడుకై ఉంటాడు.

రాణి, మాలతి చిన్ననాటి స్నేహితులు. ఇద్దరివీ వేర్వేరు పల్లెటూళ్లయినా ఒకే టౌనులో చదువుకున్నారు. మాలతి కంటే రాణి రెండేళ్ళు చిన్నది. బి.ఎ కాగానే మాలతి పెళ్ళి చేసుకొని విశాఖపట్నం వెళ్ళిపోయింది. రాణి పెళ్ళి మాలతీ వాళ్ళ ఊర్లోనే ఉన్న వాళ్ళ దూరపు బంధువు, వరుసకు బావ




అయ్యే ఒక బుల్లి జమీందారు మోహనరావుతో జరిగింది. మాలతి పుట్టింటికెళ్ళినప్పుడల్లా ఇద్దరూ కలుసుకునే వారు. ఇప్పుడు ఇక్కడ రాణిని చూడ గానే మాలతికి నాలుగేళ్ళ క్రితం తాను పుట్టింటికి సంక్రాంతి పండుగకు వెళ్ళినప్పుడు జరిగిన సంఘ టన కళ్ళ ముందు మెదిలింది.

❖❖❖

ఆ రోజు ఉదయం మాలతి, తల్లి సావిత్రమ్మ ఇద్దరూ కలిసి గారెలు చేస్తున్నారు. ఉన్నట్లుండి మాలతికి రాణి గుర్తొచ్చింది. వెంటనే తల్లిని అడి గింది, ''రాణి ఎలా ఉందమ్మా? దానికేం పిల్లలు లేరు కదా!''

సావిత్రమ్మ కాస్త చికాకుగా ''పిల్లలా దాని మొఖమా! దాని గురించి ఎంత తక్కువ చెప్పు కుంటే అంత మంచిది'' అన్నది.

''అదేంటమ్మా, అలా అంటావు! ఏమైంది దానికి?'' ఆతృతగా అడిగింది మాలతి.

''ఏం చెప్పమంటావు, అవి మర్యాదస్తులు చెప్పుకునే విషయాలు కావు. రాణి ఈమధ్య బాగా మారిపోయింది. అవతలి బజారు రాజ్యమ్మ కొడుకు సుధీర్ లేడూ, వాడు పద్దాక దీని దగ్గరకు వచ్చి పోతుంటాడట. వాళ్ళిద్దరికీ ఏదో సంబంధ ముందని అందరూ చెప్పుకుంటున్నారు. పొయ్యే కాలం కాకపోతే వాళ్ళకి ఇవేం బుద్ధులు!''

''వాళ్ళాయన లేడా ఊర్లో?'' ఆశ్చర్యంగా అడి గింది మాలతి. మాలతికి రాణి మొగుడు మోహన రావు చిన్నప్పటి నుండీ బాగా తెలుసు. అతడు చదువుకున్న వాడు, మంచివాడు, ఎంతో నెమ్మ దస్తుడు. తన పని తాను చేసుకుపోతాడు తప్ప మరొ కరి జోలి ఉండదు.

''ఎందుకు లేడూ, నిక్షేపంలా ఉన్నాడు. అసలు ఉన్నదంతా అతని దగ్గరే ఉందని జనం చెప్పు కుంటున్నారు. పాపం, పుణ్యం ఆ భగవంతుడికి తెలి యాలి. అతను సంసారానికి పనికి రాడట'' మెల్లగా చెప్పింది సావిత్రమ్మ.

''నిజమా! మరి అటువంటప్పుడు పెళ్ళెం దుకు చేసుకున్నట్టు! చదువుకున్న వాడికి ఆమాత్రం తెలియదా! పాపం రాణి జీవితం అన్యాయమై పోయింది కదా'' ఆవేదనగా అన్నది మాలతి.

''ఏముంది తల్లిదండ్రులకు తన బలహీనత చెప్పుకోలేక, ఆ విషయం బయటకు పొక్కితే అందరూ తనని చిన్నచూపు చూస్తారని భయపడి పెళ్ళి చేసుకొనుంటాడు. అయినా ఆ రాణి అయినా అయిందేదో అయింది. ఒకసారి ఆ మూడు ముళ్ళు పడిం తర్వాత చేసేదేముంది. సర్దుకు పోవాలి. గుట్టు బయటకు రానివ్వకూడదు. ఇక పిల్లలు కావాలంటే ఎవరో ఒకరిని పెంచుకుంటే పోయేది. అంతేకాని తగుదునమ్మా అని ఇలా బరితెగించి మగాడిలా బజారున పడితే ఏముంది! జనమంతా తలా ఓ మాట అంటుంటది. పరువు గంగలో కలిసిపోయె! ఈ మాయదారి టీవీలు, సినిమాలు చూసి పిల్లలు పాడయిపోతున్నారు. కలికాలం!'' నిష్ఠూరంగా చెప్పింది సావిత్రమ్మ.

''ఏంటమ్మా నువ్వు మరీను! ఒక ఆడదానివై ఉండి సాటి ఆడదాన్ని నిందిస్తున్నావు! రాణి ఎలాం టిదో నీకు తెలియదా! అయినా రాణి ఇప్పుడు తప్పు చేస్తుందంటే దానికి కారణం ఎవరు? వాళ్ళాయనేగా! తన బలహీనత బయటకు తెలిస్తే తన పరువు పోతుందని భయపడ్డాడే గాని మరొక ఆడపిల్ల నిండు జీవితం నాశనమవుతుందని ఏమన్నా ఆలోచించాడా ఆ మగమహారాజు! అదే రాణికే ఏదన్నా లోపముంటే పెళ్ళయిన మర్నాడే పుట్టింటికి తరిమేసి మళ్ళీ పెళ్ళి చేసుకునే వాడు కదా!''

''అంతే చేసేవాడేమో! అయినా మగాడు ఏం చేసినా చెల్లుతుంది. అదే ఆడది చేస్తే మన సమాజం ఊరుకుంటుందా? దుమ్మెత్తి పోస్తుంది. ఆడదానికి కొన్ని కట్టుబాట్లు ఉన్నాయి. వాటిని అధిగమిస్తే బరితెగించిందంటారు, బజారు మనిషంటారు, కొడతారు, చంపుతారు. ఇందులో కొత్తేం ఉంది.''

''అదే ఎందుకంటున్నానమ్మా? మగాడికో నీతి, ఆడదానికో నీతి! ఇంట్లో నిక్షేపం లాంటి పెళ్ళాన్ని పెట్టుకుని మగాళ్ళు బయట తిరుగుళ్ళు తిరుగుతున్నా ఎవరూ పెద్దగా పట్టించుకోరు, ఆక్షే పించరు. అదే ఆడది చిన్న పొరపాటు చేస్తే మహాప రాధం చేసిందంటారు. స్త్రీ జాతికే సిగ్గు చేటం టారు. వెలివేస్తారు. ఈ ద్వంద్వనీతి ఎందుకు?'' ఆవేశ పడింది మాలతి.

''సర్లే, ఈ ఉపన్యాసాలన్నీ వేదికల వరకే. నిజ జీవితంలో ఆచరణకు ఎంతమాత్రం పనికి రావు ... ఏం చేస్తాం! అంతా దాని ఖర్మ. దానికలా రాసిపెట్టి ఉంది. ఏ జన్మలో ఏ పాపం చేసిందో ఈ జన్మలో ఇటువంటి భర్త దొరికాడు. అనుభవించక తప్పదు. ఇక ముందు ఏం జరుగుతుందో చూద్దాం. ఇప్పటి వరకయితే అతను చూసీ చూడనట్టే పోతున్నాడట. అన్నీ తెలిసి కూడా ఏం తెలియనట్టే ఉంటున్నా డట. ఏం గొడవ చెయ్యట్లేదు.''

మాలతికి ఉన్నపళంగా వెళ్ళి రాణిని కలవాలని పించింది. అదే విషయం వాళ్ళమ్మకు చెప్పింది.

''అలాగే కలిసి వద్దువుగానీ ఇప్పుడు మాత్రం వద్దు. మీ నాన్నకు తెలిసిందంటే ప్రళయం ముంచు కొస్తుంది. పెద్ద పెద్ద పట్టణాలలో ఇటువంటివి ఎవరూ పెద్దగా పట్టించుకోక పోవచ్చు. కాని మన పల్లె టూర్లల్లో సంగతి వేరు. మొగవాడు ఏది చేసినా చెల్లు తుంది కాని ఆడది మాత్రం పెదవి విప్పినా పాపమే, గడప దాటినా పాపమే. ఈ మగాళ్ళందరూ రాణిని ఏహ్యాభావంతో చూస్తున్నారు. మీ నాన్న సంగతి సరేసరి. ఇటువంటి వాటిల్లో ఆయనది మరీ మొండి వైఖరి'' అనునయంగా చెప్పింది సావిత్రమ్మ.

విషయం తెలిసిన దగ్గర్నుండి మాలతికి మనస్సు మనస్సులో లేదు. ఎప్పుడెప్పుడెళ్ళి రాణిని కలుద్దామా అని మనసు ఆరాటపడుతోంది. రాణిని అడిగి అసలు విషయమేంటో తెలుసుకోవాలి. రాణి సంగతి తనకు బాగా తెలుసు. ఏ విషయమైనా ఎక్కువ సేపు మనసులో దాచుకోలేదు. రాణిని ఓదార్చి తన జీవితం తన చేతుల్లోనే ఉందనే విష యాన్ని దానికి గుర్తు చేయాలి. జీవితాంతం

జీవచ్ఛవంలా జీవించే కంటే తనకు నచ్చిన వ్యక్తిని పెళ్ళి చేసుకుని కొత్త జీవితానికి శ్రీకారం చుట్టటం మేలని దానికి తెలియజెప్పాలి. అలా చేయటం పాపమూ కాదు, నేరమూ కాదనే విషయాన్ని రాణికి వివరించాలి. మాలతి ఆ రాత్రి నిద్రే పోలేదు. రాణి గురించిన ఆలోచనలే ఆమె మస్తిష్కంలో సుడులు తిరుగుతూ ఉన్నాయి.

ఆ తర్వాత రెండు రోజులు పండుగ హడావిడి. ముగ్గులతో, పిండి వంటలతో సరిపోయింది మాలతికి. పండుగ వెళ్ళిన తెల్లవారి రాణి దగ్గరకు వెళ్ళా లనుకుంది మాలతి. కానీ ఆ రోజు ప్రొద్దున్నే బట్టలు తీసుకు పోవటానికి వచ్చిన చాకలి రంగి గుసగుసగా సావిత్రమ్మతో చెబుతోంది. ''ఆ రాణమ్మ గారు రాత్రికి రాత్రే ఎటో వెళ్ళిపోయారంటమ్మా. ఆ సుధీర్ బాబు కూడా ఊళ్ళో కనబడటం లేదంట. ఇద్దరూ కలిసి ఎటో లేచిపోయి ఉంటారని అనుకుంటున్నారంతా. మోహన్‌రావు బాబు తల పట్టుకు కూర్చున్నాడట దిగాలుగా.''


తర్వాత కాసేపటికి పాలేరు వెంకటేశం కూడా అదే వార్త వింతగా వినిపించాడు సావిత్రమ్మకు.

ఆ రాత్రికే ఊరు ప్రయాణమవటం, తండ్రి రోజంతా ఇంట్లోనే ఉండటంతో తల్లీ కూతుళ్ళు ఆ విషయం మాట్లాడుకోలేకపోయారు. ఆ తర్వాత రాణి గురించి మాలతికి ఏమీ తెలియదు. కాని ఇప్పుడు రాణిని సుధీర్‌తోనూ, మూడేళ్ళ పిల్లాడితోనూ చూశాక తానా రోజు విన్న విషయాలు నిజమేననిపించింది.

పక్కనున్న శేఖర్ చేతిమీద పొడిచి ''రాణిగారు ఏ లోకంలో విహరిస్తున్నారు?'' అనే సరికి మాలతి తన ఆలోచనల వలయంలో నుంచి బయటపడింది. వెంటనే శేఖర్‌కు తన స్నేహితురాలు అక్కడ కూర్చున్న సంగతి చెప్పి రాణి దగ్గరకు ఒక్క పరుగున వచ్చింది మాలతి. మాలతిని చూసీ చూడగానే రాణి గబగబా లేచి గట్టిగా చెయ్యి పట్టుకుంది. ఇద్దరికీ ఆనందంతో కాసేపటి దాకా 'బాగున్నావా? బాగున్నావా?' తప్ప మరోమాట నోట్లో నుండి రాలేదు. ఇరువురి కళ్ళు చెమ్మగిల్లాయి. పక్కనే ఉన్న సుధీర్ కూడా వెంటనే లేచి ''బాగున్నావా అక్కా?'' అన్నాడు ఎంతో ఆప్యాయంగా.

''ఎక్కడుంటున్నారు సుధీర్?'' అడిగింది మాలతి.

''చెన్నైలో టి.నగర్‌లో ఉంటున్నాం అక్కా. ప్రింటింగ్ ప్రెస్ పెట్టాను. బాగానే నడుస్తోంది'' చెప్పాడు సుధీర్. మాలతి పసివాడ్ని ఎత్తుకొని ముద్దు




పెట్టుకుంది. వాడు గింజుకుని క్రిందకు జారాడు. తర్వాత స్నేహితులిద్దరూ వెనక ఖాళీగా ఉన్న బెంచి దగ్గరకు వెళ్ళి కూర్చున్నారు.

మాలతి రాణిని ఏం అడిగితే ఏం నొచ్చుకుంటుందో అని సంశయిస్తూ ఉండగా రాణియే మొదలుపెట్టింది. మాలతి చెయ్యి పట్టుకొని ''మన ఊర్లో అందరూ బాగున్నారా మాలతీ? మా ఇంటి సంగతులేంటి? ఏంటో మాలతీ, స్వంత ఊరికీ, అయిన వాళ్ళకీ దూరంగా అజ్ఞాతవాసం చేయాల్సిన గతి పట్టింది నాకు'' దుఃఖంతో కంఠం జీరపోయింది.

''అందరూ బాగానే ఉన్నారు. కాని నువ్వే! అసలు ఏం జరిగింది?'' మనస్సులో తొలిచేస్తున్న ప్రశ్నను గబుక్కున అడిగింది మాలతి.

''జరిగిన విషయాలన్నీ నీకు తెలియవని నేననుకోను. సుధీర్, నేను ఎవరికీ చెప్పకుండా రాత్రికి రాత్రే ఊరు విడిచి రావాల్సి వచ్చింది. పాపం మా బావ ఎలా ఉన్నాడు? బావే నా జీవితం మళ్ళీ చిగురించాలని ఇదంతా చేశాడు. మా ఇద్దరికీ పెళ్ళి చేసి, యాభై వేల రూపాయలు డబ్బు ఇచ్చి మరీ చెన్నైకి పంపించాడు...''

''ఆ! రాణీ! నువ్వు చెప్పేది నిజమా! మీ బావే మీ ఇద్దరికీ పెళ్ళిచేసి పంపించాడా!'' నమ్మలేనట్టుగా అడిగింది మాలతి.

''అవును మాలతీ. బావే పంపించాడు. తనకు పెళ్ళి చేసుకోవటం ఇష్టం లేకపోయినా తల్లిదండ్రుల ఒత్తిడికి తలవొగ్గి పెళ్ళి చేసుకున్నాడు. కానీ ఆ తర్వాత మానసికంగా ఎంతో వ్యధ పొందాడు. అందుకే నా జీవితం సుఖ సంతోషాలతో పరిపూర్ణత చెందాలనే ఆరాటంతో ఇలా మా ఇద్దరినీ కలిపాడు. కాని ఇటువంటి పెళ్ళిని మన సమాజం హర్షించదు. అందుకే ముఖ్యంగా అత్తయ్య, మామయ్యలు ఊళ్ళో తలెత్తుకు తిరగలేరు. చిన్నతనంగా భావిస్తారు. మా ఇద్దరినీ దూరంగా చెన్నై పంపించాడు బావ. చెన్నైలో నున్న తన స్నేహితుడికి ఉత్తరం ఇచ్చి మమ్మల్ని అక్కడకు వెళ్ళి కలవమన్నాడు. ఆ స్నేహితుడి అండతో, బావ ఇచ్చిన డబ్బుతో ప్రింటింగ్ ప్రెస్ పెట్టుకున్నాం. అన్నీ సవ్యంగానే జరిగి పోతున్నాయి. బావను అందరూ అపార్థం చేసుకున్నారు గాని బావ చాలా మంచివాడు మాలతీ. నాకు మన ఊరు రావాలనీ, అందరినీ చూడాలని కోరికగా ఉన్నా ఎందుకో ఆ పని చేయటానికి ధైర్యం చాలట్లేదు మాలతీ. మనస్సులో నిగూఢంగా ఉన్న ఆవేదనంతా వెలిబుచ్చింది రాణి.

''నువ్వే తప్పూ చేయలేదు రాణీ. మనస్సులో ఎటువంటి అపోహలూ పెట్టుకోకు. నేను మీ బావతో మాట్లాడి నీకు తెలియజేస్తాను. నువ్వు నిర్భయంగా మన ఊరు వెళ్ళొచ్చు. నిన్ను చూసి అందరూ తప్పకుండా సంతోషిస్తారు'' ధైర్యం చెప్పింది మాలతి. మాలతికి మోహన్‌రావు ఒక గొప్ప హీరోలా కనిపించాడు. చేసిన తప్పును సరిదిద్దుకోగల గొప్ప సంస్కారం, ఒక స్త్రీని అర్థం చేసుకోగల ఔన్నత్యం ఉన్న మహోన్నత వ్యక్తి మోహన్ రావు. మోహన్ నీవే గొప్ప స్త్రీవాదివి. నీకివే నా జోహారులు అనుకుంది మాలతి మనసులో.